

ఏనుగుల సంచారం



సంచరిస్తున్న ఏనుగులు

కొత్తూరు : మండలంలోని వసప, కుంటిభద్ర పరిసరాల్లో నాలుగు రోజులుగా నాలుగు ఏనుగులు వంశధార నది తీరంలోని సమీపంలో మామిడి తోటల్లో సచరిస్తున్నాయి. దీంతో రాత్రి, పగలు అనే తేడా లేకుండా భయాందోళన చెందుతున్నారు. ఏ సమ యంలో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ఈ ఏనుగుల గుంపు వసపకు చెందిన ఓ రైతు మోటారు పైపులు ధ్వంసం చేశాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిక అందజేసినట్లు ఫారెస్టు అధికారులు తెలిపారు. ఏనుగులను కవ్వింపు చర్యలకు పాల్పరాదని ప్రజలకు సూచించారు.



విజయీభవ

- నేటి నుంచి 'పది' పరీక్షలు
- రెగ్యులర్ పరీక్షలకు 149 కేంద్రాల ఏర్పాటు
- హాజరు కానున్న 28,984 మంది
- 149 మంది సూపరింటెండెంట్లు, సిఎస్‌లు
- ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పర్యవేక్షణ
- ఓపెన్ స్కూల్ పరీక్షలకు 8 కేంద్రాలు
- హాజరు కానున్న 807మంది విద్యార్థులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పది పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 17 నుంచి 31 వరకు పరీక్షలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పటిష్టమైన ఏర్పాట్లు చేసింది. జిల్లావ్యాప్తంగా 149 కేంద్రాల్లో పది పరీక్షలు నిర్వహించనున్నారు. ఓపెన్ స్కూల్ పరీక్షలు కూడా ఏకకాలంలో నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలకు 8 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశారు. ఈ ఏడాది రెగ్యులర్ విద్యార్థులు 28,984 మంది కాగా, ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షకు 807 మంది హాజరుకానున్నారు. రెగ్యులర్ విద్యార్థుల్లో బాలురు 14,810 మంది, బాలికలు 14,174 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. రోజూ 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. విద్యార్థులను 8.45 గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. పరీక్ష సమయం పూర్తయ్యేంత వరకు కేంద్రాల్లోనే విద్యార్థులు ఉండాల్సి ఉంటుంది. అన్ని పరీక్షలకూ మూడు గంటల సమయం కేటాయించారు. విద్యార్థులకు కేటాయించిన ఒఎంఆర్ షీటు విధానాన్ని పరిశీలించుకోవాల్సి ఉంటుంది. అందువల్ల విద్యార్థులు ముందుగానే పరీక్షా కేంద్రానికి హాజరు కావాల్సి ఉంటుంది. విద్యార్థులకు హాల్‌టిక్కెట్లను ఆన్‌లైన్‌లో గాని, పాఠశాల ప్రధానోపాధ్యాయుల వద్ద గాని, ప్రభుత్వ వాట్సాప్ ద్వారా పొందడానికి వీలు కల్పించారు. విద్యార్థులకు ఫీజుల కోసం ప్రయివేటు పాఠశాలల నుంచి వేధింపులు ఎదురవుతున్నాయని ఫిర్యాదులు రావడంతో ఈవెసులు బాటు కల్పించారు. పరీక్షల నిర్వహణలో లోపాలకు తావులేకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులతోపాటు పరీక్షల నిర్వహణ సిబ్బందికి మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించడం లేదు. చీఫ్ సూపరింటెండెంట్లకు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లకు, ఇతర అధికారులకు సైతం ఈ నిబంధన వర్తిస్తుంది.

తాగునీటి సదుపాయం

పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు అవసరమైన తాగునీరు, ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఉన్నతాధికారులు పాఠశాలల యాజమాన్యాలను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో వైద్య బృందాలతో మందులు, ఒఆర్‌ఎస్ ప్యాకెట్లను వైద్య ఆరోగ్యశాఖ సిద్ధం చేసింది. పరీక్ష సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా విద్యుత్‌శాఖ చర్యలు చేపట్టింది.

144 సెక్షన్ అమలు

అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. సమస్యాత్మక పరీక్షా కేంద్రాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. పోలీసు బృందాలను కేంద్రాల వద్ద నియమించారు. మాస్‌కాపీయింగ్ నిరోధించేందుకు 149 మంది ఛీఫ్ సూపరింటెండెంట్లతో సూపరెండెంట్లను ఫ్లయింగ్ స్క్వాట్లు, సిట్టింగ్ స్క్వాడ్స్‌లను నియమించారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు

ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న కారణంగా పరీక్షా కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ఆరోగ్య సిబ్బందిని నియమించి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత బస్ సౌకర్యాన్ని ఆర్‌టిసి అందిస్తోంది. ఇప్పటికే జిల్లా కలెక్టరు స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు కావాల్సిన సూచనలను యంత్రాంగానికి సూచించారు.

ఏర్పాట్లు పూర్తి

పది పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశాం. 149 రెగ్యులర్ కేంద్రాలతో పాటు 8 ఓపెన్ స్కూల్ కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నాం. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాం. మౌలిక వసతులు కల్పించాం. సకాలంలో పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు చేరుకునేలా ఏర్పాట్లు చేశాం. ఒత్తిడి లేకుండా ప్రతి విద్యార్థి పరీక్షలు రాసేలా కేంద్రాల వద్ద మంచి వాతావరణం అలవాటు చేసుకునేందుకు వీలు కల్పించాం.

- తిరుమల చైతన్య, డిఇఒ

మౌలిక వసతులు కల్పించాలి



ఫోన్‌లో మాట్లాడుతున్న మంత్రి

కోటబొమ్మాళి: ఈ నెల 17 నుంచి 31 వరకు జిల్లాలో నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినీ విద్యార్థులు అసౌకర్యం కలగ కుండా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం డిఇఒ తిరుమల చైతన్యతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రధానంగా తాగునీరు, విద్యుత్ సౌకర్యం, విద్యార్థులు పరీక్షలు రాసేందుకు వీలుగా బెంచీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ఎక్కడా ఇబ్బందులు పడకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. కేంద్రం వద్ద వైద్య బృందాలు ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స అందించే విధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ఆత్మవిశ్వాసంతో, ప్రశాంతంగా పరీక్షలు రాయాలని అభిలషించారు. బంగారు భవిష్యత్‌కు ఉన్నత లక్ష్యాలను చేరుకునేందుకు మరో అడుగు వేస్తున్న తరుణంలో లక్ష్యంపైనే గురిపెట్టాలని సూచించారు.



మాట్లాడుతున్న తేజేశ్వరరావు

ఉద్యోగ భద్రత కల్పించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రవ్యాప్తంగా పశుసంవర్ధకశాఖలో నిలుపుదల చేసిన 1962 వాహనాల ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, 1962 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఐ.లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి ఆర్.మోహనరావులు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. నగరంలోని ఇందిరానగర్‌లో ఉన్న సిఐటియు కార్యాలయంలో ఆదివారం పశు సంవర్ధకశాఖలో తొలగించిన పశుసంచార వాహన ఉద్యోగుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారు మాట్లాడుతూ సంచార పశుఆరోగ్య సేవల వాహనాలు జిల్లాలో 18 ఉన్నాయని, వాటిని ఈ ఏడాది ఫిబ్రవరి 15 నుంచి నిలిపివేసి వాహనాలను పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడికి అప్పగించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఇచ్చిందని అన్నారు. టెర్మినేషన్ ఆర్డర్స్ కూడా జారీ అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో వాహనంలో ముగ్గురు చొప్పన సిబ్బంది పనిచేసేవారమ అన్నారు. డ్రైవర్, పారవిట్, పశు వైద్యుడు పని చేశారని చెప్పారు. తొమ్మిది వాహనాలకు ఒక రిలీవర్ కూడా పనిచేశారని వివరించారు. అయితే ఉన్నపళంగా తమను విధుల నుంచి తొలగించడంతో ఏ విధంగా వారి కుటుంబాలు బతకాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జిల్లాలో ఆమదాలవలస, పాతపట్నం, ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, శ్రీకాకుళం, ఎచ్చెర్ల మండలాలకు చెందిన వాహనాలను నిలిపివేయడంతో రైతులకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గత మూడేళ్లుగా చిత్తశుద్ధితో విధులు నిర్వహించామని, ఉన్నపళంగా విధుల నుంచి తొలగించడంతో తమతో పాటు తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. పశుసంవర్ధకశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పందించి ఉద్యోగులు అందరినీ వెంటనే విధుల్లోకి తీసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో 1962 ఉద్యోగుల సంఘం జిల్లా కోశాధికారి జి.పావని, నాయకులు పి.శ్వేత, వి.కృష్ణ, జి.రోహిత్, యు.జయకృష్ణ, డి.ధర్మారావు, ఇ.రవి, బి.నరేంద్ర, ఎం.హరి పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది



విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

శ్రీకాకుళం అర్బన్ : తెలుగు ప్రజల కోసం ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించేందుకు ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు 124వ జయంతిని ఘనంగా నిర్వహించారు. శ్రీకాకుళం పాత బస్టాండ్ కూడలిలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఆమదాలవలస, నరసన్నపేట ఎమ్మెల్యే కూన రవికుమార్, బగ్గు రమణమూర్తిలతో కలిసి ఆదివారం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆశయాలు భావితరాలకు ఆదర్శమని అన్నారు. గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా ఆయన అడుగుజాడల్లో నడుస్తూ సత్యాగ్రహం, స్వాతంత్ర్య ఉద్యమంలో పొట్టి శ్రీరాములు చురుగ్గా పాల్గొన్నారని గుర్తుచేశారు. రవికముఆర మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆశయాలకు అనుగుణంగా సిఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని అన్నారు.

'యురేకా సైన్స్ ఎక్స్‌పో' విజేతలు వీరే...

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన నిర్వహించిన యురేక సైన్స్ ఎక్స్‌పో పోటీల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు విజేతలుగా నిలిచారు. మూఢ నమ్మకాలు- శాస్త్రీయ దృక్పథం విభాగంలో ప్రథమ స్థానాన్ని నగరంలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థులు కె.తేజశ్రీ, ఎస్.అనూష విజేతలుగా నిలిచారు. సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో ప్రథమ స్థానాన్ని రణస్థలం ఎపి మోడల్ స్కూల్ విద్యార్థులు ఎ.పార్థసారథి, ఎ.సాయిసాత్విక్, భరణికుమార్, ద్వితీయ స్థానాన్ని కాశీబుగ్గ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు కొంచాడ సుధీర్ దక్కించుకున్నారు. పర్యావరణం సుస్థిరాభివృద్ధి విభాగంలో ప్రథమ స్థానాన్ని పాతపట్నం విక్టరీ హైస్కూల్ విద్యార్థులు పువ్వల జస్వంత్, ఆకుల వివేక్, పి.హర్షవర్ధన్, ద్వితీయ స్థానాన్ని జి.సిగడాం మండలం డి.బందపల్లి జెడ్‌పి హైస్కూల్ విద్యార్థి కిల్లాన జాను దక్కించుకున్నారు. విజేతలకు ఈ నెలా నెలాఖరులోగా బహుమతులు అందజేస్తామని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో విజయం సాధించిన పాఠశాలల విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ప్రిన్సిపాళ్లకు హెచ్‌ఎంలకు, పాఠశాల యాజమాన్యాలకు, ప్రోత్సహించిన సైన్స్ ఉపాధ్యాయులకు జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు, ఎడ్యుకేషన్ సబ్ కమిటీ జిల్లా కన్వీనర్ పాలవలస ధర్మారావు, యురేకా సైన్స్ ఎక్స్‌పో నాయకులు పూజారి గోవిందరావు, ఎస్.సాయిశ్రీనివాస్ శర్మ, జిల్లా నాయకులు కొత్తకోట అప్పారావు, బొడ్డేపల్లి మోహనరావు, బొడ్డేపల్లి జనార్ధనరావు, పి.కూర్మారావులు అభినందించారు.

సిఐఎస్‌ఎఫ్ సైకిల్ ర్యాలీతో అవగాహన

కమాండెంట్ సతీష్ కుమార్ బాజ్‌పాయ్




సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న చిన్నారులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తీరప్రాంత ప్రజలను అవగాహన పరిచేందుకు సెంట్రల్ ఇండస్ట్రీస్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్‌ఎఫ్) సైకిల్ ర్యాలీ చేపడుతున్నట్లు విశాఖ పోర్టు ట్రస్టు కమాండెంట్ సతీష్ కుమార్ బాజ్‌పాయ్ వెల్లడించారు. శ్రీకాకుళం కొత్త రోడ్ కూడలి వద్దకు కోలకతా రాష్ట్రంలోని బక్కలి నుంచి కన్యాకుమారి (తమిళనాడు)లోని వివేకానంద రాక్ మెమోరియల్ వరకు చేపడుతున్న సైకిల్ ర్యాలీ ఆదివారం చేరుకుంది. ఈ సైకిల్ యాత్రను టు టౌన్ సిఐ పి.ఈశ్వరరావు, సైనికుల అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దేశభక్తిని ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి సిఐఎస్‌ఎఫ్ జవాన్లలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా కమాండంట్ మాట్లాడుతూ కోల్‌కతా నుంచి 50 మంది సైకిలిస్టులు కన్యాకుమారి వరకు ఇరువైపులా 6,553 కిలో మీటర్లు సైకిల్ ర్యాలీతో చేరుకుంటారని తెలిపారు. సైకిల్ ర్యాలీలో 14 మంది మహిళలు పాల్గొన్నారని తెలిపారు. సోమవారం ఉదయం ఉదయం 6.30 గంటలకు బయలుదేరి విశాఖపట్నం సాయంత్రం 5 గంటలకు చేరుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌టిపిసి, విశాఖపట్నం నుంచి డిప్యూటీ కమాండెంట్ వినీత్‌కుమార్ ప్రభాకర్, విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచి సీనియర్ కమాండెంట్ ఎ.ఎం.హనీఫ్, అసిస్టెంట్ కమాండెంట్లు జి.శ్రీనివాస్, శ్రీకర్ లోహియా పాల్గొన్నారు. అమర సైనికులు జి.ముకుందరావు భార్య అమ్మన్నమ్మ, రామారావు భార్య వంజరాపు లక్ష్మిలకు జ్ఞాపికలు అందజేశారు.

ప్రమాద ఘటనా స్థలం పరిశీలన



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని బురుమూరు వద్ద జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం సంభవించిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృత్యువాత పడిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ప్రమాద స్థలాన్ని ఆదివారం ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి క్షుణ్ణంగా పరిశీలించి, ప్రమాదానికి గల కారణాలు ఆరా తీశారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పోలీసు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సురక్షిత ప్రయాణానికి వాహనదారులు రహదారి భద్రతా నిబంధనలు తుచ తప్పకుండా పాటించాలన్నారు. వాహనాలు నడిపే సమయంలో సురక్షితంగా, క్షేమంగా గమ్యాలను చేరుకోవాలని తెలిపారు. వాహనాలు అతివేగాన్ని నియంత్రించేందుకు రహదారి మార్గంలో ఇరువైపులా ప్రమాద సూచిక, పార్కింగ్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది నిరంతరం తిరుగుతూ ఇరువైపుల పార్కింగ్ ప్రదేశాల మినహా వాహనాలు పార్కింగ్ లేకుండా చూడాలన్నారు. ముఖ్య కూడళ్లలో సిసి కెమెరాలను ఏర్పాటు చేసి, ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈయనతో పాటు జె.ఆర్.పురం సర్కిల్ సిఐ ఎం.అవతారం, లావేరు ఎస్‌ఐ లక్ష్మణరావు ఉన్నారు.

అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలకు అదనపు సాయం

- మూడు పథకాల్లో 34,393 మందికి లబ్ధి
- డిసెంబరు 10 నాటికి నిర్మాణంలో ఉంటే ప్రయోజనం
- 23 వరకు ఇంటింటా పరిశీలనకు బృందాలు
- మే నెలాఖరులోగా 12,685 ఇళ్ల నిర్మాణం పూర్తి
- జిల్లా గృహ నిర్మాణశాఖ పీడీ నగేష్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

స్వర్ణాంధ్ర విజన్-2047లో భాగంగా జిల్లాలో 2029 నాటికి అందరికీ గృహనిర్మాణం లక్ష్యంలో భాగంగా అసంపూర్తి నిర్మాణంలో ఉన్న ఇళ్లను పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అదనపు ఆర్థిక సాయాన్ని అందిస్తోందని జిల్లా గృహ నిర్మాణశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ నగేష్ తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు అందించే అదనపు ఆర్థిక సాయానికి సంబంధించి ప్రభుత్వం జిఒ ఆర్‌టి నంబరు 9ని విడుదల చేసిందని తెలిపారు. ఈ జిఒ ప్రాప్తికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా మంజూరైన ఇళ్లను పూర్తి చేసేందుకు ఎస్‌సి, ఎస్‌టి, బిసి పేదలకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. ఎస్‌సి, బిసి లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్‌టి లబ్ధిదారులకు రూ.75 వేలు, పివిటిజి లబ్ధిదారులకు రూ.లక్ష అదనంగా అందజేయనున్నట్లు వివరించారు. గతేడాది డిసెంబరు 10 నాటికి నిర్మాణ దశలో ఉన్న ఇళ్లకు మాత్రమే ఈ సాయం అందించేందుకు వీలుందని అన్నారు. లబ్ధిదారులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకుని సొంతింటి కల నెరవేర్చుకోవాలన్నారు. ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'కి వివరించారు.





? ఎంత మందికి లబ్ధి చేకూరుతుంది?

జిల్లాలో సుమారు 34,693 ఇళ్లు అసంపూర్తిగా ఉన్నట్లు గుర్తించాం. వాటిని బాటం లెవల్, లింటర్ లెవల్, రూఫ్ లెవల్, శ్లాబ్ వేసిన తర్వాత నిలిచి పోయి ఉన్న ఇళ్లను గుర్తించాం. వాటిని ఇప్పుడు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పేదలకు సొంతింటి కల నెరవేర్చుకునేందుకు ప్రభుత్వం వివిధ పథకాలను అందిస్తోంది. పెరుగుతున్న కుటుంబాలు వారి అవసరాలకు తగ్గట్టు సొంతింటిని నిర్మించుకోవాలన్నది ప్రతిఒక్కరి కల. ఈ కల నెరవ్చేడానికి ప్రభుత్వం వివిధ రూపాల్లో సాయపడుతోంది. ప్రస్తుతం గృహ నిర్మాణశాఖ పరిధిలో కొత్త ఇళ్ల మంజూరు కంటే గతంలో మంజూరైన వాటిని పూర్తి చేసేందుకు పెద్దఎత్తున చర్యలు చేపడుతున్నాం. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా వివిధ దశల్లో నిర్మాణాలు మొదలు పెట్టి అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్లను పూర్తి చేసేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతున్నాం.

? ఎన్ని ఇళ్లు మంజూరయ్యాయి?

జిల్లావ్యాప్తంగా 30 మండలాలు, నాలుగు పట్టణ ప్రాంతాల పరిధిలో 83,308 ఇళ్లు మంజూరు చేశాం. వాటిలో 8790 ఇళ్లు నిర్మాణం వివిధ కారణాల వల్ల మొదలు కాలేదు. మొదలైన వాటిలో బిబిఎల్ స్థాయిలో 10,710, బిబిఎల్ విత్ ఎక్సపెండేచరు 3056, ఇతర దశల్లో నిర్మాణంలో 21960 ఉన్నాయి. నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారు 41,848 మంది ఇప్పటికే సొంతింటికల నెరవేర్చుకున్నారు. ఇళ్ల నిర్మాణాలకు జిల్లాలో రూ.846.59 కోట్లు ఖర్చు చేశాం. నిర్మాణాలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది.

? ఎన్ని ఇళ్లు అసంపూర్తిగా ఉన్నట్టు గుర్తించారు?

జిల్లాలో నాలుగు సామాజిక తరగతుల వారీగా 34,693 ఇళ్లు అసంపూర్తి నిర్మాణంలో ఉన్నాయని గుర్తించాం. గతంలో ప్రభుత్వం అందించిన సాయం సరిపోక పెట్టుబడి లేని వారు వాటిని పూర్తి చేయలేక మధ్యలో విడిచి పెట్టేశారు. వాటిని పూర్తి చేసేందుకు ప్రభుత్వం సంకల్పించింది. అందుకోసం కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన పట్టణ ప్రాంతంలో పిఎం అవాస్ యోజన, గ్రామీణ ప్రాంతంలో పిఎం ఆవాస్ యోజన, పిఎం జన్‌మన్ పథకాల ద్వారా మంజూరైన ఇళ్లకు లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం సంకల్పించింది. ఈ మూడు స్కీమ్‌ల పరిధిలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేసుకునేందుకు ప్రభుత్వం వీలు కల్పిస్తూ అదనపు సాయాన్ని ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వం ఇప్పటికే జిఒ నంబరు 9ను జారీ చేసింది. దీని ప్రాప్తికి లబ్ధిచేకూర్చి ఇళ్లను పూర్తి చేయడం ద్వారా పేదలకు సొంతింటికల నెరవేర్చుకునేలా చర్యలు చేపడుతున్నాం. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలి.

? ఎంతెంత సాయం అందించనున్నారు?

జిల్లావ్యాప్తంగా వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేసేందుకు ప్రభుత్వం అదనపు సాయమందిస్తోంది. బిసి, ఎస్‌సి లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్‌టి లబ్ధిదారులకు రూ.75 వేలు, పివిటిజి లబ్ధిదారులకు రూ.లక్ష అదనపు సాయం అందించేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ ప్రయోజనం పొందిన లబ్ధిదారులు సొంతింటి కలను నెరవేర్చుకునేందుకు వీలవుతుంది. పేదలందరికీ పక్కా గృహాలు నిర్మించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. నిర్మాణాలు పూర్తి చేసిన ఇళ్లకు బిల్లులు చెల్లింపు త్వరితగతిన అందించడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఈ ఏడాది మే నెలాఖరు నాటికి 12,685 ఇళ్లను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించాం. వివిధ దశల్లో నిలిచి ఉన్న ఇళ్లు పూర్తి చేసుకునేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుంది. క్షేత్ర స్థాయిలో ఎంపిడిఒలు, గృహనిర్మాణ శాఖ ఎఇలు పర్యవేక్షణ ఉంది. ఏప్రిల్ 2025లోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికి మాత్రమే అదనపు ఆర్థిక లబ్ధిచేకూరుతుంది. ఈ నెల 23 వరకు క్షేత్ర స్థాయిలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వార్డ్ ఎమెనిటీస్ సెక్రటరీలు అర్హత కలిగిన ప్రతి ఇంటినీ తనిఖీ చేసి లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇళ్లను అసంపూర్తిగా వదిలేసిన ప్రతి లబ్ధిదారునితో వారు మాట్లాడుతున్నాం. ప్రజలు సహకరిస్తే ఈ అవకాశాన్ని శతశాతం ఉపయోగించుకునేందుకు వీలవుతుంది.

నేడు, రేపు 'కేసలి' జిల్లా పర్యటన



అప్పారావు

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు జిల్లాలోని పలాస, కాశీబుగ్గ, మందస కేంద్రాల్లో సోమవారం నుంచి రెండు రోజుల పాటు పర్యటించనున్నట్లు బాలల హక్కుల కమిషన్ కార్యదర్శి ఎన్.పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా మండలాల్లోని అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, మధ్యాహ్న భోజన పథకం అమలు, బాలసదనాలు, కెజిబివిల్లో బాలలకు అందుతున్న సౌకర్యాలను పరిశీలిస్తారని అన్నారు. బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై వివిధ శాఖ అధికారులతో సమీక్షిస్తారని తెలిపారు.

కొనసాగుతున్న డ్రోన్ నిఘా



ప్రజాశక్తి- శ్రీకాకుళం

బహిరంగ మద్యం, గంజాయి సేవించడం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి హెచ్చరించారు. శ్రీకాకుళం రూరల్ శివారు ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో ఆదివారం నిఘా ఏర్పాటు చేశారు. పాత్రునివలస, సిద్ధిపేట పరిసరాలు ఖాళీ ప్రదేశాలు, పాడైన బంగ్లాలు, తోటల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఆయా ప్రాంతాల్లో బహిరంగ మద్యం సేవించడం, గంజాయి వినియోగం, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహణ, ఈవ్‌టీజింగ్, చైన్‌స్నాచింగ్ ఇతర నేరాలు జరగకుండా చర్యలు చేపట్టామన్నారు.

టిడిపి, వైసిపి దోస్తీపై ఇంటెలిజెన్స్ ఆరా

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో టిడిపి, వైసిపి నాయకుల దోస్తీపై ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఈ నెల 16న 'ప్రజాశక్తి'లో 'టిడిపి శ్రేణుల్లో ఆందోళన' అనే కథనం ప్రచురితమైంది. దీనిపై నిఘా వర్గాలు ఆరా తీయడం ప్రారంభించారు. ఏ స్థాయిలోనూ వైసిపి నాయకులతో సత్సంబంధాలు వద్దని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేయడం, ప్రజాశక్తిలో కథనం ప్రచురించడంతో నియోజక వర్గంలోని టిడిపి శ్రేణుల్లో మరింత ఆందోళన మొదలైంది. నామినేటెడ్ పదవులు కట్టబెట్టే సమయంలో సిఎం ప్రకటన పదవులు ఆశిస్తున్న టిడిపి నేతల్లో గుబులు నెలకొంది. ఇది ఇలా ఉండగా ప్రభుత్వ విప్ భజన చేస్తూ... పబ్బం గడుపుతున్న పట్టణానికి చెందిన కీలక వైసిపి నేత గురుంచీ ఆరా తీస్తున్నట్లు తెలిసింది. టిడిపికి కంచుకోటగా ఉన్న ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైసిపి నేతల సయోధ్య వల్ల పార్టీకి నష్టం వాటిల్లే అవకాశం ఉందని పరిశీలిస్తున్నట్టు తెలిసింది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి విజయానికి ఈ సయోధ్యలు నష్టం కలిగించే అవకాశమూ లేకపోలేదని టిడిపి గ్రూపులనకు చెందిన నాయకులు అంటున్నాయి. లాంఛనంగా పార్టీ మారి టిడిపిలో చేరితే ఎవ్వరికీ అభ్యంతర లేదని టిడిపి నాయకులు అంటున్నారు.

రచ్చకెక్కిన ఉపాధ్యాయుల వివాదం

పోలీసులకు ఫిర్యాదులు

టెక్కలి: మండలంలోని పెదసాన ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొడ్డేపల్లి నేతాజీ, అదే పాఠశాలకు చెందిన దళిత ఉపాధ్యాయుడు ఎలుగు ప్రసాద్‌ల వివాదం రోజుకో మలుపు తిరుగుతు రచ్చకెక్కుతుంది. తెలుగు ఉపాధ్యాయులు ప్రసాద్‌ని వేధిస్తూ... అతనిని సస్పెండ్‌కు గురిచేసిన విషయమై ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ, దళిత సంఘాలు మండిపడుతున్నాయి. ఇందుకు సంబంధించి టెక్కలిలో సమావేశమైన వారు ప్రధానోపాధ్యాయుని తీరుని వ్యతిరేకించారు. పాఠశాలకు చెందిన దళిత ఉపాధ్యాయుడు ప్రసాద్‌ని కులం పేరుతో దూషిస్తు కించపరిచారని హెచ్‌ఎంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై హెచ్‌ఎం స్పందిస్తూ... తెలుగు ఉపాధ్యాయునిపై పోలీసులకు, జిల్లా విద్యాశాఖాధికారికి ఫిర్యాదు చేశారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తున్న తనపై దుష్ప్రచారం చేపట్టి దిష్టిబొమ్మ తహనం చేయడం, కేసులు నమోదు చేయించి తనని మానసికంగా వేధిస్తున్నారని హెచ్‌ఎం వాపోయారు. ఏదేమైనా పాఠశాల వ్యవహారం రాజకీయంగా చర్చనీయాంశం కావడం గమనార్హం.


వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

పెదసాన పాఠశాల సంఘటనపై విచారణ చేపట్టాలి

డిఇఒకు యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని టెక్కలి మండలం పెదసాన ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరపాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఫెడరేషన్ (యుటిఎఫ్) రాష్ట్ర కార్యదర్శి ఎస్ కిషోర్ కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబురావు, బి.శ్రీరామ్‌మూర్తి డిఇఒ ఎస్.తిరుమల చైతన్యను కోరారు. ఆదివారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. పెద్దసాన తెలుగు ఉపాధ్యాయునిపై తీసుకున్న చర్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఆదరబాదరగా పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయునిపై చర్యలు తీసుకోవడం సరికాదని, అందరు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమక్షంలో సమగ్ర విచారణ జరిపి తప్పు చేసిన వారిపై చర్య తీసుకోవాలని కోరారు. డిఇఒను కలిసిన వారిలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.వైకుంఠరావు, జిల్లా కార్యదర్శులు పి.సూర్యప్రకాశరావు, జి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.


ప్రశంసిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

కమిషనర్ పనితీరుపై ప్రశంసలు

ప్రజాశక్తి- పలాస

గత ఆరు నెలలుగా మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు పాలనాపరంగా తీసుకుంటున్న అన్ని చర్యలు బాగున్నాయని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రశంసించారు. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కమిషనర్ తీసుకున్న చర్యలతో పురపాలక సంఘంలో శానిటేషన్ మెరుగుపడిందన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లోనూ పురపాలక సంఘం అభివృద్ధి చెందు తుందన్నారు. పక్కా ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నారని పేర్కొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఇచ్ఛాపురం : మండలంలోని ఈదుపురానికి చెందిన సంతోష్ రౌలో బ్రెయిన్ ట్యూమర్‌తో బాధ పడుతున్నారు. శస్త్ర చికిత్సకు రూ.5 లక్షలు వరకు ఖర్చు అవుతుందని వైద్యులు స్పష్టం చేశారు. నిరుపేదలైన కుటుంబ సభ్యులు దాతల సాయం కోసం ప్రాధేయపడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌జిఎఫ్ స్వచ్ఛంద సంస్థ దృష్టికి తీసుకొచ్చారు. సభ్యులు తక్షణ సాయం కింద ఆదివారం రూ.10,500 అందించారు.

ఆక్రమణల తొలగింపు

నరసన్నపేట: నరసన్నపేట మార్కెట్‌లో రహదాకి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను ఆదివారం పంచాయతీ అధికారి పి.ద్రాక్షాయిని దగ్గర ఉండి ప్రొక్లెయినర్ సహాయంతో తొలగించారు. సత్యవరం కూడలి నుంచి పల్లిపేట కూడలి వరకు రోడ్డుకి ఇరువైపులా ఫుట్‌పాత్‌పై ఉన్న షాపులను తొలగించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా షాపులను తొలగించామని అన్నారు. దీంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.


తొలగిస్తున్న ప్రొక్లెయినర్

పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు


అరసవల్లి : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న పాఠకులు


రణస్థలం : చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు


పలాస : చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎంపిడిఒ వసంతకుమార్

శ్రీకాకుళం అర్బన్ : నేటి యువతకు అమరజీవి పొట్టి శ్రీరాములు ఆదర్శప్రాయులని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. పొట్టి శ్రీరాములు 124వ జయంతి సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి జిల్లా అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు జీవిత చరిత్ర భావితరాలకు ఆదర్శం కావాలన్నారు. అనుకున్న లక్ష్యాలను అధిగమించడానికి ప్రాణాలను కూడా పనంగా పెట్టిన మహోన్నత వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారిణి ఇ.అనురాధ, ట్రెజరీస్ డిప్యూటీ డైరెక్టర్ మోహనరావు, సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఎల్. అప్పారావు, కార్యాలయ సిబ్బంది మమత, జి.గణేష్, శేఖర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యాన

నగరంలోని కార్పోరేషన్ సమీపాన గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన నివాళ్లర్పి ంచారు. డిసిసి అధ్యక్షులు అంబటి కృష్ణారావు, కాంగ్రెస్ నాయకులు చాన్ బాషా, సాయి ఉల్లాఖాన్, అంబటి దారి నాయుడు, భాషా బాబు, అనుపోజు రవికుమార్, సురియా బేగం, ఉస్మాన్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఆధ్వర్యాన

నగరంలోని పాతబాస్టాండ్ సమీపాన గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు అందవరపు సూరిబాబు, ఎం.వి పద్మావతి, ఎం.వి స్వరూప్, ఎంఎ బేగ్, పొన్నాడ రుషి, శ్రీనివాస పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో

నగరంలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ సెంటర్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ కొంఖ్యాన మురళీధర్, మాజీ గవర్నర్లు గేదెల ఇందిరా ప్రసాద్, గుడ్ల సత్యనారాయణ, స్టార్ వాకర్స్ క్లబ్ కో-ఆర్డినేటర్ శాసపు జోగినాయుడులు, డాక్టర్ ఎం. వాసుదేవాచారి, గేదెల లక్ష్మీ, వాసంతి పాల్గొన్నారు.

రణస్థలం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయి కుమార్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం హాజరై చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

లావేరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈయన జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో పి.హేమంత్ కుమార్‌కు ప్రథమ బహుమతి లభించింది. గ్రంథాలయం తరుపున బహుమతిని అందజేశారు. అనంతరం విద్యార్థులతో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు టి.వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

అరసవల్లి: బలగ హడ్కో కాలనీ శాఖా గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి గ్రంథాలయాధికారి పి.ఉగ్రసేను పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సహాయకులు కె.అనిత, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా పురపాలక సంఘ మేనేజర్ బిషోయ్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తమ్మినేని గోవిందరావు, రికార్డ్ అసిస్టెంట్ బొడ్డేపల్లి శ్రీను, మున్సిపల్ సిబ్బంది రవి, అప్పారావు, నారాయణ, శ్రీను పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని కోసమాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రామరాజు ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారసెల్లి రామరాజు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ముందుగా జిల్లా జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవం సందర్భంగా సెకండరీ స్థాయిలో విశ్లేషణాత్మక చర్చ పోటీల్లో కోసమాల తొమ్మిదో తరగతి విద్యార్థిని సలానా వర్షిని ప్రథమ స్థానం, ఆర్. లాస్య ద్వితీయ స్థానం సాధించడంతో వారికి ట్రస్టు తరుపున నగదు, జ్ఞాపికలు అందించారు. అలాగే వ్యక్తిత్వ పోటీల్లో గెలుపొందిన అనన్య, తన్మయి, ప్రణీత్ కుమార్, మహేష్ కుమార్‌లకు బహుమతులను అందించారు. అలాగే సైన్స్ ఉపాధ్యాయులు ఎం.రాజశేఖర్‌ను సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఎం.రాజశేఖర్, ఉపాధ్యాయులు అట్ల రవికుమార్, విజయ్ పాల్గొన్నారు.

పలాస : ఎంపిడిఒ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎంపిడిఒ వసంత కుమార్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ విస్తీర్ణాధికారి మెట్ట వైకుంఠరావు, మండల పరిషత్ ఎఒ అనురాధ, మండల పరిషత్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి కమిషనర్ ఎన్.రామారావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఐ అమర్ పాల్గొన్నారు.


శ్రీకాకుళం అర్బన్ : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న డిఆర్ఒ


లావేరు: బహుమతి అందజేస్తున్న గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు


ఆమదాలవలస : చిత్రపటానికి పూలమాల వేస్తున్న మేనేజర్ బిషోయ్

పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయనిక శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ బేపల సతీష్ కుమార్ సింథటిక్ ఆర్గానిక్ నేమ్ రియాక్షన్ ఆండ్ మెకానిజమ్ అనే పుస్తకాన్ని రచించారు. దీనిని కేంద్ర పౌర విమాన యానశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదివారం ఆవిష్కరించారు. బిఎస్‌సి చదువుతున్న డిగ్రీ, పిజి ఆర్గానిక్ కెమిస్ట్రీ విద్యార్థులకు ఉపయోగకరంగా ఈ పుస్తకం ఉంటుందని తెలిపారు. సతీష్‌కుమార్‌ని ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ, సిబ్బంది అభినందించారు.

సౌజన్యకు పిహెచ్‌డి


సౌజన్య

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణానికి చెందిన బగాది సౌజన్యకు 'ఉద్యోగుల నిమగ్నత' పై పరిశోధనలో పిహెచ్‌డి ప్రధానం చేశారు. జిల్లాలోని ఎచ్చెర్ల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో ప్రొఫెసర్ తమ్మినేని కామరాజు మార్గదర్శకత్వంలో ఈ పరిశోధన చేశారు. ఈమె తల్లిదండ్రులు డాక్టర్ బి..సత్యానందరావు, విజయబాల ఉపాధ్యాయ వృత్తిలో కొన సాగుతున్నారు. ఈ సందర్భంగా పిహెచ్‌డి అందుకున్న డాక్టర్ సౌజన్య మాట్లాడుతూ పరిశోధన ఫలితాలు గృహ ఉపకరణాల పరిశ్రమలో ఉత్పత్తి తీరు ఉద్యోగ సంతృప్తిని పెంచడంపై వెలుగును ఇస్తుందని తెలిపారు.



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆంధ్రప్రదేశ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా పైడి వెంకట రమణ ఎన్నికయ్యారు. ఆదివారం కలెక్టరేట్ ఆవరణలో గల ట్రెజరీ కార్యాలయంలో రాష్ట్ర పరిశీలకులు ఎం.డి. మజ్హర్ బేగ్, ఎలెక్షన్ అధికారిగా రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ మెట్ట తులసీరావు పర్యవేక్షణలో ఎన్నికలను నిర్వహించారు. ఈ ఎన్నికల్లో సహాధ్యక్షునిగా పొలుగుమతి గొగరాజు, జిల్లా ఉపాధ్యక్షులుగా మీసాల రమేష్ నాయుడు, పేరాడ మన్మధరావు, మకందర్ సల్మా, సెక్రటరీ పుప్పాల శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బోర శ్రీధర్, జాయింట్ సెక్రటరీలుగా చిట్టి చంద్రశేఖర్, పులి సింహాద్రిరాజు, జాయింట్ సెక్రటరీ (మహిళ) మామిడి మీనాక్షి, ట్రెజరర్‌గా సలాది సూర్యచంద్ర ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు.



ప్రజా చైతన్య యాత్ర నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

సూపర్ సిక్స్ అమలు ఎప్పుడు?

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఒకటీ అమలు చేయడం లేదని సిపిఎం నాయకులు బి.ఆనందరావు అన్నారు. ప్రజాచైతన్య యాత్రలో భాగంగా మండలంలోని నగరంపల్లిలో ఆదివారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు పెట్టుబడికి రూ.20 వేలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి, మెగా డిఎస్‌సి, ఎస్‌సి, ఎస్‌టి, బిసికు 50 ఏళ్లకే పింఛను, తల్లికి వందనం వంటి పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయలేదు సరే కదా ప్రజలపై భారాలు మోపుతున్నారని అన్నారు. అందుకు విద్యుత్ ఛార్జీల పెంపేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో టి.భాస్కరరావు, బి.సుగుణావతి మాట్లా డుతూ నగరంపల్లిలోని కాలనీ రోడ్డు గోతులమ యమైందని అన్నారు. దీంతో వాడుకనీరు చేరడంతో నిల్వ ఉండి దోమలు విస్తరిస్తున్నాయని అన్నారు. గ్రామ శివారున వీధిలైట్లు లేక అవస్థలు పడుతున్నారని అన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి ఈ నెల 24న నగరంపల్లి సచివాలయం వద్ద ఆందోళన చేపట్టనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎన్.మోహనరావు, ఎన్.చంద్రయ్య, బి.రామకృష్ణ, బి.లక్ష్మి, ఎన్.ఈశ్వరమ్మ, గౌరమ్మ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నిమ్మాడ తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. టెక్కలి నియోజకవర్గంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి తమ సమస్యలు మంత్రికి విన్నవించుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వీలున్నంత త్వరగా ప్రజలకు మేలు చేసేవిధంగా సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం లేకుండా నిర్వహించాలని సూచించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ప్రధానంగా నూతన నివాసాలు, పింఛన్లు, ఉపాధి అవకాశాలు, రహదారులు మంజూరు చేయాలని ప్రజలు కోరారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన నిధులు ఉన్నాయని, ఇప్పటికే నిధులు మంజూరు చేశామని తెలిపారు. నూతన పనుల కోసం ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, నాలుగు మండలాలకు చెందిన అన్నిశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

స్వయం కృషితో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

ప్రతి విద్యార్థీ స్వయం కృషితో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని మంత్రి అన్నారు. కోటబొమ్మాళికి చెందిన లాడి అలీషా ఫిజియో థెరిపీ పిజి విద్యలో ప్రథమ స్థానం సాధించి బంగారు పతకం సాధించారు. ఆమెను నిమ్మాడ తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. అలీషా రాజస్థాన్‌లో జిఇఎం కళాశాలలో మాస్టర్ డిగ్రీలో ఫిజియో థెరపీ చదివి ప్రథమ స్థానం సాధించారు. ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్న తనను సంప్రదించాలన్నారు.

నిర్లక్ష్యం చేస్తే శాశ్వత అంధత్వం


మాట్లాడుతున్న వసంతరావు

ప్రజాశక్తి- పొందూరు

కంటి చూపును కాపాడుకోవడంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా శాశ్వత అంధత్వం తలెత్తుతుందని ప్రభావతి జాగృతి ట్రస్టు వ్యవస్థాపకులు, ఆప్తాలమిక్ అధికారి, రొటేరియన్ సప్పటి వసంతరావు అన్నారు. ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు సందర్భంగా ఆదివారం పొందూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో జాలీవాకర్స్ సభ్యులకు గ్లకోమా వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్లుదాటిన తర్వాత కంటి ముందు రంగురంగు వలయాలు కనిపించిన, కంటి అద్దాలు తరచుగా మార్చాల్సి వచ్చినా సమగ్ర నేత్ర పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. నేత్ర వైద్య నిపుణులను సంప్రదించినప్పుడు కంటిలో గ్లకోమా లక్షణాలు ఉన్నాయా అంటూ అడిగి తెలుసుకోవాలని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు డా.బి.సునీల్‌కుమార్, డా.ఎస్.విజయ భాస్కర్‌లు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న 40 మందికి వాకర్ సభ్యులు అల్లంశెట్టి కృష్ణారావు, రజని దంపతులు అల్పాహారాన్ని అందించారు. కార్యక్రమంలో మోహనరావు, రమేష్, పట్నాన రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదం కరువు

- దయనీయంగా మారిన పార్కులు
- విరిగిన ఆట వస్తువులు
- పిల్లలకు వినోదం కరువు


గాంధీ పార్కులో విరిగిన జారుడుబల్ల

ప్రజాశక్తి- గుజరాతీపేట

పిల్లలకు, పెద్దలకు ఆరోగ్యాన్ని, ఆనందాన్ని అందించడంలో పార్కులు కీలకపాత్రను పోషిస్తాయి. శ్రీకాకుళం నగరంలో ఒకప్పుడు సందడి చేసిన పార్కులు ఇప్పుడు మూతపడటంతో పిల్లలు ఆడుకునే ప్రదేశం లేక రోడ్లపై తిరుగుతూ ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. పార్కుల్లో ఉండాల్సిన ఉయ్యాలలు, జారుడు బల్లలు, బెంచీలు మరమ్మతులు చేయక పోవడంతో పిల్లలు ఆడుకునేటప్పుడు అనేక ఇబ్బందులు కారణంగా పార్కుల్లో ఆడుకోవడానికి ఆసక్తి చూపడం లేదు. పిల్లలకు పార్కులు అందుబాటులో లేనందు వల్ల వారు ఇంట్లోనే టీవీ, మొబైల్ ఫోన్లుకు అతుక్కుపోతున్నారు. పార్కులు మూసివేయడంలో పిల్లలపై ఆ ప్రభావం చూపుతుంది. గతంలో పిల్లలు వేసవి సెలవుల్లో బహిరంగ ప్రదేశాల్లో ఆనందంగా గడిపేవారు. ఇప్పుడు పరిస్థితి భిన్నంగా మారింది. నగరాల్లో భూముల కొరత, ట్రాఫిక్ సమస్యల కారణంగా పిల్లలు స్వేచ్ఛగా ఆడుకునే అవకాశం కోల్పోతున్నారు. టీవీ, మొబైల్ చూడడం కంటే పిల్లలు పార్కుల్లో ఆడుకోవడం మేలని తల్లిదండ్రులు భావిస్తున్నారు. కానీ వీలుగా ఉండే పార్కులు లేవని స్థానికులు వాపోతున్నారు. పిల్లల కోసం మున్సిపాలిటీ అధికారులు పార్కులను పునరుద్ధరించాలని, కనీసం వేసవి సెలవుల్లోనైనా కొత్త వసతులతో పార్కులను అందుబాటులోకి తీసుకురావాలని నగరవాసులు కోరుతున్నారు.

నిర్దిష్ట సమయాలు పాటించాలి

పట్టణంలోని కొన్ని పార్కులు నిర్దష్ట సమయాలు లేకుండా అకస్మాత్తుగా మూసివేస్తున్నారు. పిల్లలు, వయోజనులు సమయాన్ని కచ్చితంగా తెలుసుకునే విధంగా పార్కు టైమింగ్ నిర్ణయించాలి. పార్కులు అందుబాటులో లేకపోవడం వల్ల పిల్లలు ఆడుకోవడానికి వేరే మార్గం లేక ఇబ్బంది పడుతున్నారు. స్థానికులు సాయంత్రం వేళ చల్లగాలి కోసం అలా పార్కుకి వెళితే తలుపులు మూసివేసి ఉంటాయని, ప్రభుత్వం ప్రజల వినోదం కోసం ఏర్పాటు చేసిన పార్కులు అందరికీ ఎప్పుడైనా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పార్కులు పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


నాగవళి రివర్ వ్యూ పార్కులో విరిగిన బెంచీ


పార్కులో చెల్లాచెదురుగా పడి ఉన్న ఆట బొమ్మ

వైసిపి నాయకుడు మృతి


కృష్ణారావు (ఫైల్)

సోంపేట : మండలంలోని కొర్లాంకు చెందిన వైసిపి నాయకులు గుడియా కృష్ణారావు (73) గుండెపోటుతో ఆదివారం ఉదయం మృతి చెందారు. ఈయన గతంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా పనిచేసి తర్వాత వైసిపిలో చేరారు. ఈయనకు భార్య, నలుగురు కుమారులు ఉన్నారు. వ్యాపారవేత్తగా సుపరిచితుడైన కృష్ణా రావు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.


నిందితులను ప్రవేశపెట్టిన డిఎస్‌పి మూర్తి

గంజాయితో ఇద్దరు అరెస్టు

పాతపట్నం : మండలంలోని కాపుగోపాలపురం కూడలి వద్ద 20 కేజీల గంజాయితో పట్టుబడ్డారని టెక్కలి డిఎస్‌పి వి.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం నిందితులను విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. తనిఖీల్లో భాగంగా అనుమానంతో పరిశీలించగా 20.540 కిలోల గంజాయిని దొరికిందన్నారు. గంజాయి, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.

జూదరుల అరెస్టు

కొత్తూరు : కొత్తూరు పడాలి వీధి చివరిలో ఓ ఖాళీ స్థలంలో కొద్ది రోజులుగా పేకాట ఆడుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.4,820 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ అహ్మద్ అమీర్ ఆలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఇరుక్కున్న ఉండిపోయిన గ్రానైట్ లారీ

ఇరుక్కున్న లారీ

టెక్కలి రూరల్ : టెక్కలి నుంచి మెళియాపుట్టి వెళ్లే మార్గంలో ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఆదివారం ఓ గ్రానైట్ లారీ ఇరుక్కుంది. దీనబంధుపురం నుంచి నిమ్మాడ వైపు వెళ్తున్న ఈ గ్రానైట్ లారీ టెక్కలి ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద నుంచి వస్తుంది. ఈ సమయంలో ఆ గ్రానైట్ బ్లాక్ బ్రిడ్జి కింద భాగంలో ఇరుక్కోవడంతో లారీ ఎటు కదలని స్థితిలో ఉండిపోయింది. దీంతో కొంత సమయం ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. క్రేన్ల సహాయంతో లారీని బయటకు తీశారు.

హెల్పింగ్ హేండ్స్‌కు అభినందన

రణస్థలం: మండలంలోని రణస్థలంలో హెల్పింగ్ హేండ్స్, మెడికవర్ ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సందర్శించి మాట్లాడుతూ ప్రతివ్యక్తి ఆరోగ్యం కాపాడుకోవాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హెల్పింగ్ హేండ్స్ సభ్యులు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

కరాటేలో బంగారు పతకం

కోటబొమ్మాళి: విశాఖపట్నంలో ఇటీవల నిర్వహించిన ఇంటర్‌స్టేట్ డిఫెన్స్ కరాటే చాంపియన్‌షిప్ పదో తరగతి విభాగంలో మండలం విశ్వనాథపురానికి చెందిన గొండు సుశీల్ తరంగ్‌కు బంగారు పతకం గెలుచుకున్నారు. అలాగే నరసన్నపేట సెవిట్‌క్లారిట్ పాఠశాలలో నిర్వహించిన బెల్టు గేడింగ్ టెస్టులో ఆరెంజ్ బెల్టుతో, ఓవర్ అల్ ఛాంపియన్ షిప్ గెలుచుకున్నారని చీఫ్ ఇనిస్టుటర్ గౌతమ్ కుమార్ ఆదివారం తెలిపారు. విక్టరీ ఫొటో ఖాన్ కరాటీ అసోసియేషన్ చీఫ్ మల్లికార్జునరావు, స్కూల్ ప్రిన్సిపాల్ బాలాకుమార్ ట్రోఫి, బంగారు పతకంతో సుశీల్ తరంగ్‌ను సత్కరించారు.


పతకాన్ని అందజేస్తున్న అధికారులు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న ధరణి

ఎమ్మెల్యేకు సన్మానం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలని శాసనసభలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఇటీవల ప్రస్తావించారు. ఈ మేరకు గిరిజన సంఘ నాయకులు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం సన్మానించారు. జిల్లాలో ఎక్కువగా గిరిజనులు ఉన్న మండలం మెళియాపుట్టి అని, అలాగే మౌలిక సదుపాయాలు కల్పించాలని, గిరిజన జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, పలు గిరిజన సమస్యలను ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రస్తావించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి, గిరిజన సంఘ నాయకుడు బైరిసింగి లక్ష్మీనారాయణ, జిల్లా గిరిజన మహిళ అధ్యక్షులు బైరిసింగి ధరణి మర్రిపాడు-సి, సర్పంచ్ రవ్వల గణపతిరావు, సవర కుమార్ పాల్గొన్నారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

మాజీ ఎమ్మెల్యేకు అభినందనలు

కొత్తూరు : మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి కృషితో మండలంలోని ఓండ్రుజోల పంచాయతీకి నిమ్మగెడ్డ కృష్ణమూర్తి రైతు విభాగం అధ్యక్షునిగా, గూనభద్రకు పంచాయతీ నుంచి అంపిలి బుచ్చిబాబు నియోజకవర్గ అంగన్వాడీ విభాగం అధ్యక్షునిగా నియమితులయ్యారు. ఈ మేరకు వారు రెడ్డి శాంతిని ఆదివారం కలిసి అభినందిస్తూ... సన్మానించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణరావు, జిల్లా ఎస్సి సెల్ కార్యదర్శి గంధవరపు నాగేంద్ర, సంకు వరహాలింగం, మండల అధ్యక్షుడు ఆనందరావు, ఎంపిటిసి వనం లక్ష్మీనారాయణ, ఎంపిపి ప్రతినిధి రమేష్, బిసిసెల్ అధ్యక్షులు నాగేశ్వరరావు, మాజీ ఎంపిటిసి కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ముక్కు మూసుకుంటేనే ముందుకు పోయేది

ప్రజాశక్తి- పొందూరు

ముక్కు మూసుకుంటూ నడుచుకుంటూ వెళ్తున్న ఈ దృశ్యం పొందూరు - చిలకపాలెం రహదారిలోని ఎరుకులపేట సమీపంలోనిది. రహదారి పక్కనే కోళ్ల వ్యర్ధాలను, చెత్తాచెదారాలను పడివేస్తుండడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పొందూరు, పరిసర గ్రామాల ప్రజలు ఈ రహదారిలోనే వేకువజామున వాకింగ్ చేస్తుంటారు. కోళ్ల వ్యర్ధాలు, చెత్తాచెదారాలు పడివేయడం వలన ఆ ప్రాంతం దగ్గరకు వచ్చేసరికి వాకింగ్ చేసేవారు ముక్కు మూసుకుని రన్నింగ్ చేయాల్సి వస్తుందంటూ పలువురు వాపోతున్నారు. అధికారులు స్పందించి రహదారి పక్కన చెత్తాచెదారాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ముక్కు మూసుకుంటూ పరిగెత్తుతున్న వాకర్స్

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం

నెహ్రూ యువ కేంద్రం డీడీ వెంకట్ ఉజ్వల్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వినియోగదారులకు సమగ్ర అవగాహన లేక పోవడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని, అందువల్ల ప్రజల్లో అవగాహన కోసం విస్తృత ప్రచారం జరగాలని నెహ్రూ యువ కేంద్రం డీడీ వెంకట్ ఉజ్వల్ అన్నారు. ఆదివారం నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సెమినార్ నిర్వహించారు. యువజన వ్యవహారాలు, క్రీడలు మంత్రిత్వ శాఖ, మై భారత్, నెహ్రూ యువ కేంద్రం సంయుక్తంగా నిర్వహించిన ఈసెమినార్‌లో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.ఆర్ శ్రీనివాస్ పాత్రో మాట్లాడుతూ వినియోగ దారుల హక్కులు, అవసరాలపై అవగాహన పెంచేందుకు వినియోగదారుల ఉద్యమం కొనసాగుతోందన్నారు. అందులో భాగంగా హక్కుల దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఏటా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సెమినార్‌లో ఇంగ్లీష్ అధ్యాపకులు వై.మురళీధర్ మాట్లాడుతూ వినియోగదారుల చట్టబద్ధమైన అవసరాలను తీర్చుకునేందుకు పటిష్ట వంతమైన చట్టాలు ఉన్నాయన్నారు. వాటిని సద్వినియోగ పరచుకోవాలని ఆయన సూచించారు. సెమినార్‌లో హిస్టరీ లెక్చరర్ యు.ప్రతిష్ట తదితరులు మాట్లాడారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్ పాత్రో

క్రికెట్ టోర్నమెంట్‌కు సహకరించాలి



మాట్లాడుతున్న విద్యాసాగర్

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్‌కు అందరూ సహకరించాలని సిఎంసిసి ఆర్గనైజర్ తమ్మినేని విద్యాసాగర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో క్రికెట్ అసోసియేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్ పోటీలను ప్రతి ఏడాది నిర్వహిస్తున్నామని అదే విధంగా ఈ ఏడాది కూడా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. అనంతరం గ్రౌండ్, పిచ్‌ను సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రికెటర్లు నారా ఈశ్వరరావు, గంధం వేణుగోపాలరావు, వలివేటి రాధాకృష్ణ, బిట్టు, అనీల్, కౌసిక్, బలివాడ శ్రీనివాస్, కాత్ర సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సాయంతో కుళాయిల ఏర్పాటు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

దాతల సహకారంతో పాఠశాలలో తాగునీటి ట్యాంకు, పైపులైన్, కుళాయిలు ఏర్పాటు చేసుకున్నామని అక్కుపల్లి శ్రీరామా సేవా సంఘం అధ్యక్షులు మోస వరప్రసాద్ తెలిపారు. అక్కుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తమ తల్లితండ్రులు జ్ఞాపకార్థం దాతలు ట్రాన్స్‌కో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జోగి కృష్ణమూర్తి, జోగి ఢిల్లీరాజు రూ.70 వేలు ఖర్చుతో నిర్మించిన వాటర్ ట్యాంకు, పైప్‌లైన్, కుళాయిలను ఆదివారం ప్రారంభించారు. అలాగే పాఠశాల మరుగుదొడ్లకు పార్కింగ్ టైల్స్ ఏర్పాటు చేసిన కాస యువరాజు, కాస తులసిదాస్, యంపల్ల మోహనరావులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డొక్కరి జనార్ధన్, చైర్‌పర్సన్ కొవిరి ఇంద్రప్రియదర్శిని, సర్పంచ్ ప్రతినిధి లండ రామలింగం, సూరాడ మోహనరావు, విద్యా కమిటీ చైర్మన్ కోనేరు మోహనరావు పాల్గొన్నారు.



దాతలను సన్మానిస్తున్న సంఘ సభ్యులు

మామిడి కాయ దశలో ఆశించే తెగుళ్లు - నివారణ

ప్రజాశక్తి- రణస్థలం

జిల్లాలో మామిడి పంటను సాగు చేసే రైతుల సంఖ్య ఎక్కువగా ఉంది. వేసవిలో ప్రజలకు అందుబాటులోకి వచ్చే ఈ ఫలానికి మార్కెట్‌లో డిమాండ్ కూడా ఎక్కువే. ప్రస్తుతం మామిడి తోటలు పిందె, కాయదశలో ఉన్నాయి. ఈ సమయంలో అనేక తెగుళ్ల ఆశించి పంటకు తీవ్ర నష్టాన్ని కలిగించే అవకాశం ఉంది. ఆ తెగుళ్లను సకాలంలో గుర్తించి అదుపు చేస్తే మంచి దిగుబడులకు అవకాశం ఉంటుంది. మామిడి పంటను ఆశించే బూడిద తెగులు, మసి తెగులు లక్షణాలు.. వాటిని ఎలా నివారించాలో తెలుసుకుందాం.

బూడిద తెగులు

ఈ తెగులు సోకినప్పుడు పైరెమ్మలు, పూత, పిందెల మీద బూడిద లాంటి తెల్లటి పదార్థం ఏర్పడుతుంది. ఈ శిలీంద్రం పూత, పిందె నుంచి పోషకాలను పీల్చుకోవడం వల్ల అవి రాలిపోతాయి. రాత్రి చలి ఎక్కువగా ఉండి.. పగటి ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నప్పుడు ఈ తెగులు ఆశిస్తుంది.

నివారణ

నీటిలో కరిగే గంధకం 3 గ్రా. (లేదా) డినోకాప్ 1మి.లీ. (లేదా) హెక్సాకోనజోల్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

మసి తెగులు, మసి మంగు

రసం పీల్చే పురుగులైన తేనె మంచు పురుగు, పిండి నల్లి, తామర పురుగులు ఆశించి ఆకులు, పూత, పిందె, కాయల మీద తేనె లాంటి తియ్యని పదార్థాన్ని విసర్జిస్తాయి. ఈ పదార్థంపై శిలీంద్రాలు పెరిగి నల్లని మసి మంగు ఏర్పడుతుంది. ఆకులపై మసి మంగు ఏర్పడడం వల్ల కిరణజన్య సంయోగక్రియకు అంతరాయం కలిగి కాయ పరిమాణం తగ్గడమే కాకుండా రాలిపోతాయి. తెగులు సోకిన కాయలు అమ్మడానికి పనికి రాకుండా పోతాయి.

నివారణ

మొదటిగా రసం పీల్చే పురుగులను నివారించాలి. పురుగు అధికంగా ఉంటే ఫిప్రోనిల్ 2 మి.లీ. (లేదా) ఎసిఫేట్ 1.5 గ్రా. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.




సిసి రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న రమేష్

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనే టిడిపి ధ్యేయమని జిల్లా టిడిపి కార్యాలయ కార్యదర్శి మొదలవలస రమేష్ అన్నారు. ఆదివారం 8వ వార్డు పరిధి రామ మందిరం వీధి నర్సింగరావు కాలనీలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. లక్షలతో రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి హయాంలో పురపాలక సంఘంలో రహదారులు అధ్వాన స్థితికి చేరుకున్నాయని, పురపాలక సంఘం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఎమ్మెల్యే రవికుమార్ చొరవతో పురపాలక సంఘానికి నిధులు మంజూరవుతున్నాయని తద్వారా అభివృద్ధి పనులు శరవేగంగా జరగనున్నాయన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గుండ లక్ష్మణరావు, రెడ్డి రాంబాబు, వెంకటేష్ పాల్గొన్నారు.



దీక్షల్లో పాల్గొన్న బెంతు ఒరియాలు

కొనసాగుతున్న దీక్షలు

ప్రజాశక్తి- కవిటి

తమ భవిష్యత్ భరోసా కోసం బెంతు ఒరియాలు కవిటిలో చేస్తున్న రిలే నిరాహారదీక్షలు 445వ రోజుకి చేరుకున్నాయి. అందులో భాగంగా ఆదివారం దీక్షలో మజ్జిపుట్టుగ గ్రామస్తులు పాల్గొని తమ సంఘీభావం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ తరగతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో విద్యార్థుల ఉన్నత చదువులు, నిరుద్యోగుల ఉపాధి గాల్లోపెట్టిన దీపంలా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ప్రభుత్వ పథకాలకూ దూరమవుతున్నట్టు తెలిపారు. అందుకే తమకి గుర్తింపు, తమ బిడ్డల భవిష్యత్‌కు భరోసా దక్కేవరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

వినియోగదారుల హక్కుల కమిషన్ జిల్లా వైస్ చైర్మన్‌గా సంతోష్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురానికి చెందిన వినియోగదారుల హక్కుల కమిషన్ జిల్లా వైస్ చైర్మన్‌గా సంతోష్‌కుమార్ సాహు నియమితులయ్యారు. విశాఖ కార్యాలయంలో నియమికపత్రాన్ని నేషనల్ చైర్మన్ డాక్టర్ సాయిరమేష్ చేతుల మీదగా అందుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ అవకాశం ఇచ్చిన నేషనల్ చైర్మన్ డాక్టర్ సాయి రమేష్‌కి ఎపి చైర్మన్ శ్రీనివాస్ యాదవ్‌కి, సౌత్ చైర్మన్ దాడి సత్యనారాయణకి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల్లో వినియోగదారుల అవగాహన తీసుకురావడానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ వైస్ చైర్మన్ విశ్వనాథం, అనకాపల్లి జిల్లా చైర్మన్ హేమంత్ చరపాక పాల్గొన్నారు.



నియామకపత్రం అందుకుంటున్న సంతోష్